అన్నదాతకు అకాల కష్టం

2,200 ఎకరాల్లో పంటనష్టం

- వ్యవసాయ శాఖ అంచనా
- రైతుల వివరాలు సేకరించాలి
- రెండు మూడు వారాలు అకాలవర్షాల ముప్పు
- పంట నష్టం లేకుండా చర్యలు
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : రెండు రోజులుగా కురుస్తున్న అకాల వడగండ్ల వర్షాలకు పలు జిల్లాల్లో 2,200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని, పూర్తిస్థాయి రైతువారీ పంట నష్టం అంచనాపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అకాల వర్షాల వల్ల నారాయణపేట, కామారెడ్డి, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, యాదాద్రి, సిద్దిపేట జిల్లాలలో పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక నివేదికలు అందాయని తెలిపారు. దాదాపు 2,200 ఎకరాల వరకు వరి, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేశామని చెప్పారు. వచ్చే రెండు, మూడు వారాలు అకాల వర్షాల ముప్పు ఉందని, పంట నష్టం తగ్గించేవిధంగా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, ఇతర పంటలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులు సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లలోనూ వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు పంటలు తడవకుండా ఉండేందుకు ఇప్పటికే 2 లక్షలకుపైగా టార్పాలిన్ కవర్లను రైతులకు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే తడిసిన ధాన్యం

- కాంటా జాప్యంతోనే రైతన్నకు దైన్యం
- కొనుగోలు కేంద్రాల్లో దయనీయ పరిస్థితులు
- కన్నెత్తి చూడని అధికారులు, ప్రజాప్రతినిధులు
- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని రైతుల డిమాండ్

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు. చుట్టూ ఉన్న నీటిని తొలగిస్తున్న మహిళా రైతు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అకాల వర్షం అన్నదాతలకు అంతులేని కష్టాల్ని తెచ్చిపెట్టింది. ప్రభుత్వం ధాన్యం సేకరణ వేగవంతం చేయకపోవడంతో భారీగా ధాన్యం వర్షార్పణమైంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులైనా.. ధాన్యం కొన్న దాఖలాలు లేవు. కొన్నిచోట్ల కాంటా వేసినా ధాన్యం మిల్లులకు తరలించకపోవడంతో బస్తాలు తడిసిముద్దయ్యాయి. శనివారం పలు జిల్లాల్లో కురిసిన గాలివానతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఉన్న ధాన్యం నీళ్లపాలయ్యింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో ఎక్కడ చూసినా ధాన్యం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వ్యవసాయ మార్కెట్లు, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలలో రైతుల కండ్ల ముందే ధాన్యం వాననీటికి కొట్టుకుపోయింది. రోడ్లపై ఆరబోసిన ధాన్యం కూడా వానపాలయ్యింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రంగంపేట సెంటర్‌లో వరదకు కొట్టుకుపోయిన ధాన్యం జంపన్న చెరువులో కలిసిపోయింది. జనగామ, దేవరకద్ర, వనపర్తి మార్కెట్ యార్డుల్లో ధాన్యం బస్తాలన్నీ తడిసిపోయాయి. దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, అక్కన్నపేట, సిద్దిపేట రూరల్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు కుటుంబసభ్యులతో కలిసి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతూ, నీళ్లలోంచి వడ్లను వేరుచేస్తూ కనిపించిన దృశ్యాలు ఆవేదనకు గురిచేశాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తడవకుండా ఉండేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. సరిపడా టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతోనే ఈ దుస్థితి దాపురించిందని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రెండ్రోజులుగా వర్షాలు కురుస్తుంటే.. ఎన్నికల బిజీ పేరుతో రైతాంగాన్ని యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలె..

5 ఎకరాల్లో వరి వేసిన. ఐదు రోజుల కిందటనే పంట కోపిచ్చిన. ఐదు రోజుల నుంచి వడ్లు ఆరుతున్నాయి. ఒక గంట అయితే కాంటా అయితుండె. అసుంటిది క్షణాల్లో వాన పడి వడ్లు మొత్తం తడిసిపోయాయి. గింజలు చేతికి వస్తలేవు. ఏమీ తోస్తలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కోరుట్ల లక్ష్మి, ఆకులకొండూర్, నిజామాబాద్ జిల్లా

వడ్లు నేల రాలినయ్

12 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. గిసుంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ సూడలేదు. సగం పంట తెచ్చింది తెచ్చినట్లే తడిసి పోయింది. సంచుల్లో నింపిన వడ్లు నాని పోయినయ్. 5 ఎకరాల్లో వరి కోసేది ఉంది. గాలివానకు మొత్తం నేలరాలింది. గొలలకు వడ్ల గింజలే లేవు. మొత్తం రాలిపోయినయ్. మా పరిస్థితి ఎట్లనో అర్థం అయితలేదు. పెట్టుబడి ఖర్చు సుతా ఎల్తదో ఎల్లదో. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- సుమన్, తిర్మన్‌పల్లి, నిజామాబాద్ జిల్లా

సగం కూడా మిగలలేదు

ఈదురుగాలతో అచ్చిన వానకు ఎండబెట్టిన ధాన్యం మొత్తం కొట్టుకుపోయింది. 15 రోజుల నుంచి ఐకేపీ సెంటర్ కాడనే పడిగాపులు గాస్తున్న. ఆఫీసర్లు, రైస్‌మిల్లర్ల యజమానులు కుమ్మకై మమ్మల్ని తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ఈ సెంటర్ల రైతులను పట్టించుకున్న వారే లేరు. చెడగొట్టు వానతోని మా గ్రామంలోని రైతులందరం నష్టపోయినం. రంగు మారిన వడ్లను ప్రభుత్వమే కొనాలె. పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలె.

- పడిగె రాములు,సోమార్‌పేట,మాచారెడ్డి మండలం, కామారెడ్డి జిల్లా

పవర్ మంత్రికి 'పవర్ కట్'

సీపీఐ ఆఫీసులో ఉండగానే నిలిచిన విద్యుత్తు సరఫరా

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో కరెంట్ కోతల్లేవు.. ఉన్నాయంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు.' అని మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసహనం వ్యక్తం చేసి 24 గంటలు తిరగక ముందే స్వయంగా ఆయనకే విద్యుత్తు కోత సెగ తగిలింది. శనివారం సాయంత్రం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. సమావేశం జరుగుతుండగా సాయంత్రం 6.45 గంటలకు సీపీఐ కార్యాలయంతోపాటు పరిసరాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కొద్దిసేపటి తర్వాత పరిసర ప్రాంతాల్లో కరెంటు వచ్చినా సీపీఐ కార్యాలయానికి మాత్రం రాలేదు. దీంతో భట్టి, సీపీఐ నేతలు పావుగంటకు పైగా కార్యాలయంలో చీకట్లోనే ఉండాల్సి వచ్చింది. దీనిపై విద్యుత్తు శాఖ అధికారులు ట్విట్టర్ వేదికగా స్పందించారు. సీపీఐ కార్యాలయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగిందని, సుమారు 15 నిమిషాల వ్యవధిలోనే సరఫరాను పునరుద్ధరించామని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ అధికారులు ట్విట్టర్‌లో పోస్టు చేశారు. విద్యుత్తు కోతలంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న భట్టికి మరునాడు అదే కోతల సెగ ఆయనకే తగిలిన అంశం చర్చనీయాంశంగా మారింది.

అదనపు చార్జిషీట్‌లో కొత్త విషయాలుండాలి

- పాత విషయాలతో దాఖలు చేస్తే చెల్లదు
- కింది కోర్టులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత తిరిగి దాఖలు చేసే అదనపు చార్జిషీట్‌లో కొత్త విషయాలు ఉండాలని, పాత విషయాలతోనే మళ్లీ సమర్పిస్తే దానిని పరిగణనలోకి తీసుకోరాదని కింది కోర్టులకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ఇటీవల తీర్పు వెలువరించారు. నిరాధార అసంబద్ధ ఆరోపణలతో గృహహింస కేసు నమోదు చేయడానికి వీల్లేదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ఉదహరించారు. సోనం వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సెక్షన్ 498ఏ కింద విచారణ చేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. వరకట్న వేధింపుల కింద ఫాతిమా తన భర్త దబీరుద్దీన్ ఖాజా, ఆమె అత్తమామలు, ఆడపడుచులు ఇతరులపై హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. తొలి చార్జిషీట్‌లో భర్త ఖాజాపై మాత్రమే అభియోగాలున్నాయని కోర్టుకు నివేదించిన పోలీసులు రెండేండ్ల తర్వాత అత్తమామలు, ఆడపడుచులు వారి భర్తలపై కూడా అభియోగాలు మోపుతూ అదనపు చార్జిషీట్ దాఖలు చేశారు. దీన్ని సవాల్ చేస్తూ మహ్మద్ ఆసీఫుద్దీన్ ఇతరులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. పిటిషనర్లపై ఆధారాల్లేవని తొలి చార్జిషీట్‌లో పేర్కొన్న పోలీసులు రెండేండ్లకు సౌదీ అరేబియాలోని భర్త అత్తమామలు, ఆడపడుచులు వారి భర్తలను నిందితులుగా చేర్చుతూ అదనపు చార్జిషీట్ దాఖలు చేయడాన్ని వాళ్ల తరపున న్యాయవాది తప్పుపడుతూ వాదించారు. వాదనల తర్వాత న్యాయమూర్తి, కొత్త అభియోగాలు లేకుండా అదనపు చార్జిషీట్ దాఖలు చేస్తే చెల్లదని తెలిపారు. పిటిషనర్లు వారి అత్తమామలు, ఆడపడుచులపై నమోదైన కేసును కొట్టేస్తూ తీర్పు వెలువరించారు.

26,833 ఫోన్ల రికవరీ

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : దొంగిలించిన, మిస్సింగ్ అయిన ఫోన్లను రికవరీ చేయడంలో తెలంగాణ పోలీసులు రెండోస్థానంలో నిలిచారని, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఏడాదిలో 26,833 ఫోన్లను వెతికిపట్టుకొని, బాధితులకు అప్పగించామని సీఐడీ ఏడీజీ శిఖాగోయెల్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గతేడాది ఏప్రిల్ 19న తెలంగాణలో పైలట్ ప్రాజెక్టు కింద సీఈఐఆర్ విధానాన్ని ప్రారంభించగా మే 17 నుంచి దేశవ్యాప్తంగా సేవలు కొనసాగుతున్నాయి. సీఈఐఆర్‌కు తెలంగాణ నుంచి సూపర్ యూజర్‌గా ఉన్న ఏడీజీ శిఖాగోయెల్ రాష్ట్రంలోని 780 పోలీస్ స్టేషన్లలో ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. మొదటి 100 రోజుల్లో 4,489 ఫోన్లు, 200 రోజుల్లో 11,203 ఫోన్లు, 365 రోజుల్లో 26,833తో రోజుకు సగటున 73 మొబైల్స్ రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ కమిషనరేట్ 4,348 ఫోన్ల రికవరీలో మొదటిస్థానంలో ఉండగా.. తర్వాతి స్థానాల్లో సైబరాబాద్ (2772), రాచకొండ (2767) ఇతర కమిషనరేట్లు ఉన్నాయని వెల్లడించారు.

ఒక్క గింజ కొంటే ఒట్టు

- కాగితాలపైనే కొనుగోలు కేంద్రాలు
- పేరుకుపోతున్న ధాన్యం కుప్పలు
- 7104 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ప్రకటనలు
- నేటికి 2480 కేంద్రాల్లోనే కొనుగోళ్లు
- పదిరోజులుగా కేంద్రాల్లోనే రైతుల పడిగాపులు
- వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- భారీ వర్షాలకు వడ్లన్నీ వర్షార్పణం

హైదరాబాద్, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ) : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతున్నది. అకాల వర్షాల ముప్పు ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసినా సర్కారు పెడచెవిన పెట్టింది. రాష్ట్రంలో కాంటా పెట్టేది లేదు... ధాన్యం కొనుగోలు చేసేది లేదు అన్నట్టుగా తయారైంది పరిస్థితి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎక్కడికక్కడే ఉండిపోయాయి. తాజాగా అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని వడ్లన్నీ వర్షార్పణం అయ్యాయి. ఇలా ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు కడగండ్లు మిగిల్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం, శనివారాల్లో కురిసిన అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది.

మొత్తం కేంద్రాలు 7104.. 2480 కేంద్రాల్లోనే కొనుగోళ్లు

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వం కన్నా ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పింది. 7వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ప్రకటనలు గుప్పించారు. కానీ ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. పేరుకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ఇందులో సగానికి పైగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లనే ప్రారంభించలేదని తెలిసింది. 7200 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసిన పౌరసరఫరాల సంస్థ ఇందులో ఇప్పటి వరకు 7104 కేంద్రాలను ప్రారంభించింది. వాటిలో 2480 కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించడం గమనార్హం. అంటే పౌరసరఫరాల సంస్థ ప్రారంభించినట్టుగా చెప్పుకొంటున్న 4624 కేంద్రాల్లో ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం. అంటే ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉన్నదో తెలిసిపోతున్నది. ఖమ్మం జిల్లాలో 157 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు ఇందులో కేవలం 12 కేంద్రాల్లో మాత్రమే ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ 136 కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇందులో కేవలం 12 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 195 కేంద్రాలకుగానూ ఇప్పటికీ 34 మాత్రమే ఏర్పాటు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. ఈ జిల్లాలో 64 కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్క కేంద్రంలోనూ రైతుల నుంచి ఒక్క ధాన్యపు గింజ కూడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం. ఈ విధంగా పేపర్లపైనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ధాన్యం కొనుగోలును మరిచిపోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వర్షం హెచ్చరికలు.. పట్టింపులేని ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల గురించి ఏ మాత్రం పట్టింపులేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇందుకు సాక్షీభూతంగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వడగండ్ల వర్షాలు రాబోతున్నాయని వారం క్రితమే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనికి తోడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వర్షాలు వచ్చే అవకాశం ఉందని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం ఈ హెచ్చరికలను పెడచెవిన పెట్టింది. యథావిధిగానే కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహించింది. దీంతో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మొత్తం తడిసిపోయింది. కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల తిప్పలు అన్నీ ఇన్నీ కావు. కండ్ల ముందే ధాన్యం కొట్టుకుపోతుంటే రైతుల దుఃఖం వర్ణనాతీతం. వర్షపు నీళ్ల నుంచి ధాన్యాన్ని చేతులతో ఎత్తుకుంటున్న పరిస్థితి హృదయ విదారకరంగా ఉంది. ఇలా ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆరు గాలం కష్టం చేసి పండించిన ధాన్యం నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేలరాలిన మామిడి కూలిన పైకప్పులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గాలిదుమారంతో శనివారం కురిసిన వర్షానికి జనగామ జిల్లాలో మామిడి, కూరగాయలు, పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లింగాలఘనపురం మండలం నేలపోగులలో తాటి చెట్టుపై పిడుగు పడింది. ఉమ్మడి వరంగల్,మెదక్ జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మామిడి కాయలు నేలరాయాలి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొక్కజొన్న, జొన్న, నువ్వులు, పొద్దుతిరుగుడు, మిర్చి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. 1021ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు



మార్కెట్‌కు తేవొద్దు

మొదటిపేజీ తరువాయి...

సమీక్షలో సీఎం చెప్పినా పట్టించుకోకుండా మద్దతు ధరకు కొనేందుకు ట్రేడర్లు నిరాకరిస్తుండడంతో అధికారులు మార్కెట్‌కు నిరవధిక సెలవును ప్రకటించారు. ఈ-నామ్ ట్రేడింగ్ ద్వారా యార్డులో క్వింటాల్ ధాన్యాన్ని రూ.1530కే కొనుగోలు చేయడంపై ఈ నెల 11న 'నమస్తే తెలంగాణ'లో 'రైతుకు దుఃఖం.. దళారులకు రొక్కం' శీర్షిక కన రైతులకు అందని మద్దతు ధరపై కథనం ప్రచురితం కాగా అదే రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహించాడని మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌ను సస్పెండ్ చేసి తక్కువ ధరకు కోట్ చేసిన ముగ్గురు ట్రేడర్లపై చీటింగ్ కేసు నమోదు చేశారు. అదేరోజు సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మార్కెట్ యార్డును సందర్శించి అధికారులతో మాట్లాడిన తర్వాత క్వింటాల్ ధాన్యంపై కేవలం రూ.30 పెంచి రూ.1560 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో మరోసారి రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వ్యాపారులు మద్దతు ధరకు 'మేం కొనం గాక..కొనం' అంటూ భీష్మించారు. ధాన్యం రాశులతో 10రోజుల పడిగాపులతో ఆక్రోశం పెరిగి ఉధృతం అవుతున్న నిరసనలను తట్టుకోలేక జిల్లా యంత్రాంగం తేమ శాతాన్ని బట్టి ధర చెల్లింపుపై రైతులకు నచ్చజెప్పి.. అనధికారికంగా వ్యాపారులను ఒప్పించారు. యార్డులో పేరుకుపోయిన దాదాపు 50వేల బస్తాల పాత నిల్వలను బలవంతంగా ఈ నెల 16న క్వింటాలుకు రూ.1,700 నుంచి 1,923కు ట్రేడర్లు కొనుగోలు చేశారు. నిల్వలు పేరుకుపోవడం, తరలింపు పేరిట వరుసగా నాలుగురోజులు అంటే ఈ నెల 20 వరకు యార్డుకు సెలవులు ప్రకటించి కొత్తగా అమ్మకానికి తెచ్చే రైతులను యార్డుకు అనుమతించలేదు. ఈ నెల 22న (సోమవారం) యార్డులో కొనుగోళ్లను యథావిధిగా ప్రారంభించాల్సి ఉండగా మార్కెట్ అధికారులు మాత్రం కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రైవేట్ ఖరీదుదారులు సిద్ధంగా లేనందున వ్యవసాయ మార్కెట్‌కు ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులను తేవద్దని కోరారు. పైగా రైతులెవరూ తమ వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోరాదని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో యార్డులో కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ పేరిట పత్రికా ప్రకటనల విడుదల చేశారు. రైతులంతా తమ గ్రామాల్లోని ఐకేపీ, పీఏసీఎస్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సహా మార్కెట్ యార్డుకు ఆనుకొని ఉన్న పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఉచిత సలహా ఇచ్చారు.

నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వరి ధాన్యం గ్రేడ్-ఏ రకం రూ.2,203, కామన్ రకం రూ.2,183కు మాత్రమే అమ్ముకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం ప్రకటించే వరకు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తేవద్దని చెప్పడం చర్చనీయాంశమైంది.

సీఎం చెప్పినా.. కొనుగోళ్లు బంద్

'నమస్తే తెలంగాణ' వరుస కథనాలపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉన్న తన్థాయి అధికారుల సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రైతులకు ప్రభుత్వ మద్దతు ధర అందాలని, ట్రేడర్లు, వ్యాపారులు ముందుకు రాకుంటే ప్రభుత్వ రంగ సంస్థల కేంద్రాల ద్వారా కొనాలని ఆదేశించారు. మార్కెటింగ్, రెవెన్యూ, సహకార, పౌరసరఫరాలు వంటి దాదాపు 50మంది జిల్లా అధికారులు యార్డులో పర్యవేక్షణ బాధ్యత చూసినా, ధాన్యం రైతుకు మద్దతు ధర రాకపోగా మొత్తం యార్డునే మూసివేయాల్సిన పరిస్థితి వచ్చింది. ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.2,200 చెల్లించాల్సిన ప్రభుత్వం కుంటి సాకులు చెప్పి రూ.1,700 నుంచి 1,923కు తగ్గించి రైతును దగా చేసింది. ధాన్యంపై క్వింటాలుకు రూ.500 బోనస్ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు దేవుడెరుగు, అసలు ధరకే రూ.500 చిల్లు పడింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అంగట్లో వేలంపాట ద్వారా వ్యాపారులు నిర్ణయించిన ధరకే తెగనమ్ముకోవాల్సిన దుస్థితిని సృష్టించారు. ఎమ్మెస్పీ క్వింటాలుకు రూ.2,200కంటే తక్కువకు ఎవరూ అమ్మొద్దు అంటూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులపై మొసలి కన్నీరు కార్చి..ఆదేశించిన తర్వాత మంచి ధరకు అమ్ముకోవచ్చని ఆశపడినా కాంగ్రెస్ పాలనలో మద్దతు ధర మిథ్యే అని తేలింది.

పంట ఎండి.. గుండె పగిలి రైతు ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

బూర్నపల్లికి చెందిన రైతు కొండ రమేశ్ (44) తనకున్న రెండెకరాల భూమిలో వరి సాగు చేశాడు. అహర్నిశలు కష్టపడి పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇంకో తడి నీళ్లు పారితే పంట చేతికొచ్చేది. కానీ, చివరి దశలో నీరు అందకపోవడంతో మొత్తం ఎండిపోయి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతు రమేశ్ పది రోజులుగా తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. శుక్రవారం చిట్యాల మండలం గిద్దముత్తారంలోని తన చెల్లి ఇంటికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. తన పొలం సమీపంలోని బూర్నపల్లి గుట్టకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం కట్టెల కోసం గుట్టకు వెళ్లిన వారికి రమేశ్ మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులకు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని చిట్యాల వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

రైస్‌మిల్లు యజమాని మాయాజాలం

- 2.86 లక్షల ధాన్యం బస్తాలు మాయం
- కల్వకుర్తి పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో ఘటన
- చర్యలపై ఉన్నతాధికారులకు సిఫారసు

కల్వకుర్తి, ఏప్రిల్ 20: పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో భారీగా ధాన్యం బస్తాలు మాయమైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో చోటుచేసుకున్నది. కల్వకుర్తి పట్టణంలోని లక్ష్మీ వెంకటనర్సింహస్వామి పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో శనివారం హైదరాబాద్ సివిల్‌సప్లయి, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు జరిపారు. సీఎంఆర్ వడ్లకు సంబంధించిన లెక్కలు చూసి మిల్లులోని బస్తాలను లెక్కించారు. సీఎంఆర్‌కు సంబంధించిన 2,86,694 ధాన్యం బస్తాలు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. వీటి విలువ రూ.23.3 కోట్లుగా అధికారులు తెలిపారు. చాలా మంది మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని చీకటి మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సివిల్‌సప్లయి, టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం రైస్‌మిల్లులో తనిఖీలు చేపట్టింది. ధాన్యం బస్తాలు మాయమవడంతో మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. ఈ దాడుల్లో డీఎస్‌డీవో, డీఎం(క్వాలిటీ కంట్రోల్), డీటీలు పాల్గొన్నారు.